ఎక్సైజ్ కేసుల పరిష్కారానికి చర్యలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఎక్సైజ్ కేసుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ గంధం సునీత ఎక్సైజ్ అధికారులను ఆదేశించారు. తూర్పు గోదావరి, కాకినాడ, కోనసీమ జిల్లాల ఎక్సైజ్, ఎస్ఇబి అధికారులతో ఆమె బుధవారం సమావేశం నిర్వహించారు. మార్చి 9న ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌లో అధిక సంఖ్యలో రాజీ పడదగిన ఎక్సైజ్ కేసులను పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఎక్సైజ్ కేసుల జాబితాను జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు అందజేయాలన్నారు. ఈ సమావేశంలో తూర్పు గోదావరి అడిషనల్ ఎస్‌పి పి.సోమశేఖర్, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్లు, ఎస్ఇబి, ఎక్సైజ్ సిఐలు పాల్గొన్నారు.

ఈసారీ నిరాశే...

- కాటన్ బ్యారేజీ ఆధునికీకరణ హుళక్కే
- వినపడని కోనసీమ రైలు కూత
- బడ్జెట్‌లో జిల్లాకు దక్కని ప్రాధాన్యత

ప్రజాశక్తి- కాకినాడ, రాజమహేంద్రవరం ప్రతినిధులు

ఆర్థిక మంత్రి బుగ్గన ప్రవేశపెట్టిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్ మరోసారి జిల్లా వాసులను నిరాశపరిచింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా విమర్శలు వినిపిస్తున్నాయి. ఎన్నికల నేపథ్యంలో జిల్లాకు అధిక ప్రాధాన్యత ఉంటుందని భావించారు. ముఖ్యంగా పెండింగ్ ప్రాజెక్టులు గాని, ఇరిగేషన్ రంగానికి గాని ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వలేదు. కోనసీమ రైల్వే లైన్‌కు రాష్ట్ర ప్రభుత్వం వాటా చెల్లించాల్సి ఉంది. ఈ సారీ ఈ ప్రాజెక్టుకు నిధుల మాట ఎత్తలేదు. పర్యాటక, పారిశ్రామిక అభివృద్ధిపైనా సారీ అనేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూనే రాష్ట్ర స్థూల ఉత్పత్తి రేటులో పురోగమనం, పంటల బీమా పథకాన్ని రైతులందరికీ వర్తింపజేయడాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఘనతగా చెప్పుకొన్నారు.గత కేటాయింపులకు సంబంధించి ఈ బడ్జెట్ లో నిధుల వినియోగం ఊసెత్తలేదు. గత బడ్జెట్ లో ఉప్పాడ హార్బర్ పనులకు నిధులను కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. కాని ఈ ప్రాజెక్టుకి ఇప్పటి వరకూ 40 శాతం నిధులనే కేటాయించగా ఈ బడ్జెట్ లో మిగిలిన నిధుల గురించి ప్రస్తావన రాలేదు.

కోటిపల్లి - నర్సాపురం రైల్వే లైను పూర్తి కావడం కోసం కోనసీమ ప్రజానీకం 22 ఏళ్లుగా ఎదురు చూస్తోంది. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం దఫదఫాలుగా రైల్వే బడ్జెట్ ల్లో మొత్తం రూ.1,100 కోట్లు కేటాయించింది. మొత్తం నిర్మాణ వ్యయంలో రాష్ట్ర ప్రభుత్వం 25 శాతం వాటా ఇవ్వాల్సి ఉంది. ఈ నాలుగేళ్ళలో రాష్ట్ర ప్రభుత్వం తన వాటాకు సంబంధించిన నిధులు కేటాయింపు చేయని కారణంగా నిర్మాణ పనులు నిలిచిపోయాయి. సుమారు రూ.350 కోట్లు రాష్ట్ర వాటా ఇవ్వాల్సి ఉంది. అయితే అనేక వినతులు ఇవ్వగా 55 కిలోమీటర్ల పొడవునా ఉన్న ఈ లైన్ కు భూ సేకరణ చేస్తామని అందుకు అయ్యే ఖర్చును భరిస్తామని ప్రభుత్వం రైల్వేకు గతంలోనే తెలిపింది. ప్రస్తుతం భూ సేకరణ నత్తనడకన జరుగుతోందని కోనసీమ వాసులు చెబుతున్నారు. భూ సేకరణ నిధుల కేటాయింపుపై గతంలో ఇచ్చిన హామీ మేరకు ప్రాజెక్టు కొనసాగింపుగా ఈ బడ్జెట్ లో నిధుల మాట ఎత్తలేదు.

ఎక్కడి సమస్యలు అక్కడే

విశాఖ-కాకినాడ మధ్య పెట్రో రసాయనాల పెట్టుబడుల కేంద్రం వస్తుందని కాకినాడ జిల్లా వాసులు ఎప్పటి నుంచో ఎదురు చూస్తున్నారు. కాకినాడ సెజ్‌లో నేటికీ పరిశ్రమల జాడ కనిపించడం లేదు. జిల్లా వాసుల తాగునీటి కష్టాలకు శాశ్వత పరిష్కారం చూపే జల్ జీవన్ మిషన్ పనులకు గత బడ్జెట్‌లో నిధులను కేటాయించినా పనులు నాటి నుంచి ఒక్క అడుగు ముందుకు పడలేదు. జిల్లాలో పలు రహదారుల పనులకు భారీగా సొమ్ములు కేటాయించాల్సి ఉంది. గతంలో నిధులను కేటాయించామని ప్రభుత్వం చెప్పిన నాటి నుంచి ఇప్పటివరకు రహదారుల పరిస్థితి అధ్వాన్నంగానే ఉంది. కాకినాడలో విడుదలయ్యే 50 మిలియన్ లీటర్ల వ్యర్థ జలాలను శుద్ధి చేసేందుకు గతంలో రూ.10 కోట్లు వెచ్చించారు. కానీ నేటికీ నిధులను కేటాయించక పనులు ప్రారంభం కాలేదు. కాకినాడలో సైన్స్ సెంటర్, గోదావరి కళాక్షేత్రం, స్టేడియంలను ఇటీవల హడావుడిగా ప్రారంభించినా ఇంకా బిల్లులు పెండింగులోనే ఉన్నాయని కాంట్రాక్టర్లు గగ్గోలు పెడుతున్నారు.



రైతుల ఆశలు ఆవిరి

రైతుల కోసం రూ.33,300 కోట్లు ఖర్చు చేసినట్లు చెబుతున్న రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలో అత్యంత కీలకమైన ధవళేశ్వరం కాటన్ బ్యారేజ్ గేట్ల ఆధునికీకరణకు చేతులెత్తేసింది. గతేడాది రూ.61 కోట్లు కేటాయించిన విషయం విధితమే. అయితే నిధులు కొరత వల్ల ఈ పనులు నేటికీ ప్రారంభం కాలేదు. బ్యారేజీపై రోడ్డు మరమ్మతులు సైతం చేపట్టకపోవటంతో వాహన చోదకులకు ఇబ్బందులు తప్పలేదు. తాజా బడ్జెట్లోనూ నిధుల కేటాయింపు లేదు. దాదాపు 10 లక్షల ఎకరాలకు బ్యారేజీ నుంచి సాగునీటిని అందిస్తున్నారు. కీలకమైన గేట్ల ఆధునికీకరణను విస్మరించడంతో ఉమ్మడి జిల్లా వాసులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో ఏటా నిర్వహించాల్సిన కాల్వల పూడికతీత పనులు చేపట్టకపోవడంతో గోదావరి వరదలు, అకాల వర్షాలకు రైతులకు పంట నష్టం తప్పడంలేదు. గోదావరిలో ఇసుక పూడిక తీత పనులు చేయడానికి గతంలో టెండర్లు పిలిచారు. కాని బడ్జెట్లో నిధులు కేటాయించలేదు. జాతీయ నదీ పరిరక్షణ ప్రణాళిక (ఎన్ఆర్‌సిపి) కింద 'గోదావరి నది కాలుష్య నివారణ, పరిరక్షణ' ప్రాజెక్ట్ కోసం కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ 2022లో రూ.88.43 కోట్లు మంజూరు చేసింది. ప్రాజెక్టు మొత్తం వ్యయం రూ.416 కోట్లుగా అంచనా వేశారు. కాని కేంద్రం రూ.88.43 కోట్లు మాత్రమే మంజూరు చేసింది. ఈ ప్రాజెక్టు పనులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 60:40 నిష్పత్తిలో సంయుక్తంగా చేపట్టాలి. రాష్ట్ర వాటా నేటికీ కేటాయించలేదు. పారిశ్రామిక అభివద్ధి, ఉపాధి కల్పన ఊసే ఎత్తలేదు. పోలవరం నిర్వాసితులకు ఎకరాకు రూ.5 లక్షల చొప్పున పరిహారం, అలాగే ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ రూ.6.50 లక్షలకు బదులు రూ.10 లక్షల ఇస్తామని ముఖ్యమంత్రి జగన్ గతంలో హామీ ఇచ్చిన ఈ బడ్జెట్లోనూ స్పష్టమైన హామీ ఇచ్చిన దాఖలాలు లేవు. సాగునీటి ప్రాజెక్టులను పూర్తిగా విస్మరించడంతో జిల్లా రైతాంగం తీవ్ర అసహనం వ్యక్తం చేస్తుంది. యువతకు ఉపాధి కల్పించే రంగాన్ని విస్మరించారు. స్థూల ఆదాయంపై అంకెల గారడి వినిపించారు. ఇళ్ల నిర్మాణానికి కేటాయింపులు సాధారణంగానే ఉన్నాయి. ప్రభుత్వం ఇస్తున్న అరకొర సొమ్ములు లబ్ధిదారులు కనీసం పునాదులు కట్టుకోవడానికి కూడా సరిపోని పరిస్థితులు ఉన్నాయి. ఈ బడ్జెట్ లోనైనా తగిన నిధులు కేటాయిస్తారని లబ్ధిదారులు ఆశించి భంగపడ్డారు.

పోలీస్‌స్టేషన్‌లో ఉన్న ఆశావర్కర్లతో మాట్లాడుతున్న సిపిఎం నగర కార్యదర్శి పవన్

ఆశాలపై పోలీసుల నిర్బంధం

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

డిమాండ్ల సాధన కోసం, సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన చలో విజయవాడ పిలుపు నేపథ్యంలో ఆశావర్కర్లపై పోలీసులు నిర్బంధకాండను సాగించారు. 20 మంది ఆశావర్కర్లను బుధవారం రాత్రి పోలీసులు అరెస్టు చేసి ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం వ్యక్తిగత పూచికత్తుపై విడుదల చేశారు. చలో విజయవాడ కార్యక్రమానికి వెళ్లరాదని ఆశ వర్కర్ల నుంచి లెటర్లు తీసుకున్నారు. ఆశ వర్కర్ల అక్రమ అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నామని సిపిఎం నగర కార్యదర్శి బి.పవన్ అన్నారు. ఆశ వర్కర్లను ఆక్రమంగా అరెస్టు చేశారన్న సమాచారం తెలుసుకున్న పవన్ వెంటనే పోలీసు స్టేషన్ కి వెళ్లి అక్కడ పోలీస్ అధికారులతో మాట్లాడారు.

సిఐటియు ఖండన

విజయవాడ వెళ్లకుండా రాష్ట్ర ప్రభుత్వం పోలీసులను ఉపయోగించి ఆశాలను ముందస్తు అరెస్టులు చేయడాన్ని సిఐటియు ఖండించింది. బుధవారం ఉదయం ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ రాజమండ్రి అధ్యక్ష, కార్యదర్శులు దుర్గ, హావేలలను ముందస్తు అరెస్టు చేశారు. వారిని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రాజులోవ పరామర్శించారు. ఈ సందర్భంగా రాజులోవ మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో ఆశాల సమస్యలు పరిష్కరించడం లో విఫలమైందన్నారు. ఎన్నోసార్లు అధికారులకు సమస్యలు విన్నవించినా ఒక్క సమస్యకూడా పరిష్కరించలేదన్నారు. ఈ ప్రభుత్వం ప్రజాస్వామ్య బద్ధంగా జరిగే నిరసనలు అణచివేయలని చూస్తుందన్నారు. ఇది సరైన పద్ధతి కాదన్నారు. రాష్ట్ర ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కొంటున్న తరుణంలోనూ ప్రభుత్వం నియంతృత్వ పద్ధతులు అనుసరించడం సరికాదన్నారు. వెంటనే అరెస్టు చేసినవారిని విడుదల చేయాలన్నారు.

1వ వార్డులో ఎంపీ భరత్ పర్యటన

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

నగరంలోని 1వ వార్డులో ఎంపీ మార్గాని భరత్‌రామ్ బుధవారం పర్యటించారు. లాలా చెరువు, సుబ్బారావు పేట వర్కర్స్ కాలనీ నుంచి ఆయన పర్యటన ప్రారంభించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాలు అమలుపై ఆరా తీశారు. రోడ్లపక్కన చిరు వ్యాపారులతో మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రానున్న ఎన్నికల్లో ఎంఎల్‌ఎగా పోటీ చేస్తున్నానని తనను, జగన్ అన్నను గెలిపించాలని భరత్ అభ్యర్థించారు. వార్డులో అంబేద్కర్, వైఎస్ఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నగర అధ్యక్షులు అడపా శ్రీహరి, వార్డ్ ఇంఛార్జి ముప్పాన ప్రభాకర్, వార్డు పెద్దలు, బిసి జెఎసి రాష్ట్ర ఛైర్మన్ మార్గాని నాగేశ్వరరావు, పాలిక శ్రీను, అజ్జరపు వాసు, ఎన్‌వి.శ్రీనివాస్, ఎం.లక్ష్మి పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న సిఐ తులసీధర్

నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి

ప్రజాశక్తి - కడియం

నిబంధనలు పాటిస్తూ ప్రయాణికులను సురక్షితంగా గమ్యాలకు చేర్చాలని కడియం సిఐ బి.తులసీధర్ ఆటో డ్రైవర్లకు సూచించారు. కడియం ఆటో యూనియన్ డ్రైవర్లకు రోడ్డు ప్రమాదాల నివారణపై, స్థానిక బస్టాండ్ వద్ద ఆయన బుధవారం అవగాహనా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైవర్లు విధిగా యూనిఫామ్ ధరించాలన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోరాదన్నారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ, మద్యం సేవించి ఆటోలను నడుపరాదన్నారు. ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని లేకుంటే చలానాలతో పాటూ వాహనాన్ని సీజ్ చేస్తామన్నారు. అనుమానాస్పద, అపరచిత వ్యక్తులపట్ల అప్రమత్తంగా ఉండాలని, అటువంటి వ్యక్తుల కదలికలపై తమకు సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ మహ్మద్ అశ్ఫాక్, కృష్ణసాయి పాల్గొన్నారు.

కార్టూ'నిజం'

త్యాగశీలి రమాబాయి అంబేద్కర్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం, తాళ్లపూడి

రమాబాయి అంబేద్కర్ త్యాగ శీలి అని పలువురు నాయకులు అన్నారు. రమాబాయి అంబేద్కర్ 126వ జయంతిని గోకవరం బస్టాండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద దళిత, గిరిజన, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్‌సి, ఎస్‌టి ఉద్యోగ సంఘాల నాయకులు కోరుకొండ చిరంజీవి అధ్యక్షత వహించారు. రమాబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వద్ద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌సి, ఎస్‌టి ఉద్యోగ సంఘాల అధ్యక్షులు తాళ్లూరి బాబురాజేంద్రప్రసాద్, రత్నం ఆర్గనైజేషన్ వ్యవస్థాపకాధ్యక్షులు దారా ఏసురత్నం, పాటి రామారావు, ఏలేటి రాజారావు, దళిత మహిళా నాయకులు ఖండవిల్లి లక్ష్మి, పి.ప్రశాంతి, జువ్వల రాంబాబు, పాము బాబూరావు, ఉసురుమర్తి రామారావు, కోరుకొండ మురళీకష్ణ, జె.అబ్బులు తదితరులు పాల్గొన్నారు. రాజమహేంద్రవరం రాజేంద్రనగర్ సచివాలయం వద్ద అంబేద్కర్ ఫెడరేషన్ స్టూడెంట్స్ ఆధ్వర్యంలో రమాబాయి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జక్కంపూడి విజయలక్ష్మి హాజరై రమాబాయి అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ సమాజంలోని మహిళలు రమాబాయి అంబేద్కర్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగం వల్లే ఈ రోజు మహిళలకు అన్ని విధాలుగా హక్కులు లభించాయన్నారు. అంబేద్కర్ విజయం వెనుక రమాబాయి పాత్ర ఎంతో ఉందన్నారు. రమాబాయి గురించి ప్రతి ఒక్కరికీ తెలియాల్సిన అవసరం వున్న నేపథ్యంలో రానున్న రోజుల్లో ఆమె యొక్క జీవిత చరిత్రను పుస్తక రూపంలోకి తీసుకొస్తామన్నారు.

తాళ్లపూడి మండలం రాగోలపల్లి ఎంపిపి పాఠశాలలో హెచ్ఎం దున్నా దుర్గారావు ఆధ్వర్యంలో రమాబాయి జయంతిని నిర్వహించారు. రమాబాయి త్యాగాలను వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉపాధ్యాయులు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు..

ఆపన్నులకు చేయూత

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో బుధవారం ఆపన్నులకు చేయూత కార్యక్రమం నిర్వహించారు. స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమంలోని వృద్ధులు, అనాథలు, కుష్టుబాధితులకు రూ.20వేల విలువైన దుప్పట్లు. దుస్తులు, బియ్యం, పండ్లు ఇతర నిత్యావసర వస్తువులను అందజేశారు. శ్రీ గౌతమి జీవ కారుణ్య సంఘం వారి విజ్ఞప్తి మీరకు ప్రీతి మిక్సర్ కం గ్రైండర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ రామచంద్ర.ఆర్‌కె మాట్లాడారు. ఇటువంటి కార్యక్రమాలను మరిన్ని నిర్వహించాలన్నారు. రసాయన శాస్త్ర విభాగాధిపతి శ్రీనివాసరావు మాట్లాడుడూ విద్యార్థులకు విజ్ఞానంతో పాటు సమాజసేవను పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో సమన్వయకర్త డాక్టర్ ఇఎస్ఆర్ఎస్.శర్మ, జాకోబు, బి.వెంకటరావు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

సాయం అందిస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

ఉపాధి సిబ్బందితో సమీక్షా సమావేశం

ప్రజాశక్తి - చాగల్లు

చాగల్లు మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపిడిఒ నాతి బుజ్జి ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆర్తిక సంవత్సరం లేబర్ బడ్జెట్ పూర్తి చేసేందుకు, 2024-2025 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన కొత్త పనులకు అంచనాలు తయారు చేసి ఆమోదానికి పంపేందుకు ప్రతిపాదనలు తయారు చేయాలని ఆమె ఆదేశించారు.

ఘనంగా రాయుడు పుట్టినరోజు

ప్రజాశక్తి - గోపాలపురం

టిడిపి దొండపూడి గ్రామ అధ్యక్షులు ముత్యాల రాయుడు పుట్టిన రోజు బుధవారం ఘనంగా జరిగింది. ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు సమక్షంలో ఆయన పుట్టినరోజు కేక్‌ను కట్ చేవారు. నియోజకవర్గం నాయకులు, ప్రముఖులు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలకు ఆయన తేనేటి విందు ఇచ్చారు.

వారికి జగన్ అంటే భయం

అందుకే పవన్, బాబు ఎత్తుగడలు

ఎంపీ మార్గాని భరత్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

జగన్మోహన్‌రెడ్డి అంటే టిడిపి, జనసేనకు భయమని, వైసిపితో పోరాడటం కష్టమని గ్రహించే బిజెపితో పొత్తుకు నానాపాట్లు పడుతున్నాయని ఎంపీ మార్గాని భరత్‌రామ్ అన్నారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. బిజెపి నేతలు ఆహ్వానించకపోయినా చంద్రబాబు, పవన్ బిజెపి కార్యాలయం గేట్ల వద్ద గంటలు, రోజుల తరబడి వేచి ఉండటం అలవాటేనన్నారు. వచ్చే ఎన్నికలలో బిజెపితో జతకట్టకపోతే ఉనికి కోల్పోవడం ఖాయమని చంద్రబాబు, పవన్ గ్రహించే ఎలాగైనా కమలనాథుల పొత్తు కోసం తహతహలాడుతున్నారని విమర్శించారు. తమ పార్టీ మాత్రం రాష్ట్రంలో 175 అసెంబ్లీ, 25 లోక్‌సభ స్థానాల్లో ఒంటరిగానే పోటీ చేస్తుందన్నారు. జగన్మోహన్ రెడ్డి మరోసారి సిఎం కావడం ఖాయమన్నారు.

డీవార్మింగ్ డేను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-గోకవరం, కడియం, గోపాలపురం

డీవార్మింగ్ డేను విజయవంతం చేయాలని డాక్టర్ తిరన్ తెలిపారు. గోకవరంలో ప్రభుత్వ, ప్రయివేటు విద్యాసంస్థలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ నెల 9న డీ వార్మింగ్ డేకు సంబంధించి కరపత్రాలు, పోస్టర్లు, ఆల్బెండాజోల్ మాత్రమను పంపిణీ చేస్తున్నామని ఆయన తెలిపారు. గోకవరంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, కృష్ణుని పాలెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, వివిధ ప్రయివేట్ స్కూల్స్‌లో వీటిని అందించారన్నారు. ప్రతి విద్యార్థీ మాత్రలు వేసుకునేలా చూడాలన్నారు. కొత్తపల్లి ప్రభుత్వ పాఠశాలలో ఆయన చేతిమీదుగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్ఇఒలు మూర్తి, శంకర్ హెల్త్ అసిటెంట్లు పవన్, రమణ, శ్రీను, అప్పారావు, రాజు, నాగేశ్వరవు, ఎంఎల్‌హెచ్‌పిలు, ఎఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు. **కడియం** 9నమధ్యాహ్నం భోజనం చేసిన తరువాత నులిపురుగుల నివారణ కొరకు, ప్రభుత్వం సరఫరా చేసిన ఆల్బెండజోల్ టాబ్లెట్లు పిల్లలకు వేయాలని కడియం మండలం లోని అన్ని పాఠశాలల ఉపాధ్యాయులకు ఎంఇఒ లజపతిరాయ్ సూచించారు. ఈవిషయాన్ని ఎనిమిదవ తేదీ ఉదయం అసెంబ్లీ సమయంలోనే అందరికీ చెప్పాలని, విద్యార్థుల డైరీ లలో మరియు నోటీసు బోర్డులపై రాయాలన్నారు. అనారోగ్యంగా ఉన్న వారి విషయంలో సంభందిత వైద్య సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమం ను అందరూ విజయవంతం చేయాలని కోరారు. **గోపాలపురం** నులిపురుగుల నివారణ కార్యక్రమం విజయవంతం చేయాలని ఎంపిడిఒ కె.రమేష్ పిలుపునిచ్చారు. బుధవారం ఎంపిడిఒ కార్యాలయం వద్ద మండలంలోని అన్నదేవరపేట, హుకుంపేట పిహెచ్‌సి వైద్య అధికారులు, వైద్య సిబ్బంది, ఐసిడిఎస్ సిబ్బందితో ఎంపిడిఒ సమావేశమయ్యారు. 9న నిర్వహించే నులిపురుగుల నివారణ కార్యక్రమం విద్యార్థులందరికీ మాత్రలు వేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు వివి.దుర్గాభవాని, పి.స్వర్ణలత, సూపర్‌వైజర్లు, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

మాత్రలు, పోస్టర్లను అందిస్తున్న డాక్టర్ తిరన్

హైవేను పరిశీలించిన అధికారులు

ప్రజాశక్తి - గోపాలపురం

జీలుగుమిల్లి - కొవ్వూరు 265 జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా దొండపూడి సెంటర్లో 23 మీటర్ల విస్తరణ రహదారి పనులను 18 మీటర్లకు కుదించాలంటూ గ్రామస్తులు ఇచ్చిన వినతులను పరిగణంలో తీసుకున్న రెవెన్యూ అధికారులు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బుధవారం పరిశీలించారు. సబ్ కలెక్టర్ అశితోష్ వాస్తవ్, ట్రైనీ కలెక్టర్ యశ్వంత్ కుమార్‌రెడ్డి తహశీల్దార్ వనజాక్షి దొండపూడి సెంటర్‌ను పరిశీలించారు. ఈ మేరకు జాతీయ రహదారి సర్వేయర్, మండల సర్వేయర్, విఆర్ఒ అసిస్టెంటు బృందాన్ని ఏర్పాటు చేశారు. రహదారి కిరువైపులా సర్వే చేసి 23 మీటర్ల నిర్మాణం వల్ల జరిగే నష్టాన్ని, రహదారి కుదించడం వల్ల గ్రామస్తులు కలిగే ప్రయోజనాన్ని అంచనా వేసి నివేదికను రెండు రోజుల్లో సమర్పించాలని తహశీల్దార్ వనజాక్షిని ఆదేశించారు. వారి వెంట సర్పంచ్ అచ్చిబాబు డిప్యూటీ తహశీల్దార్ ఎస్.కృష్ణ గ్రామస్తులు, వైసిపి మండల అధ్యక్షులు పోతిరెడ్డి నాగరాజు తదితరులున్నారు.

హైవేను పరిశీలస్తున్న అధికారులు

శంకుస్థాపన చేస్తున్న బిఎస్ఎన్ఎల్ జిఎం రాజు

టవర్ నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-గోకవరం

మండలంలోని భూపతిపాలెం గురుకుల పాఠశాల ఆవరణలో బుధవారం బిఎస్ఎన్ఎల్ 4జి టవర్ నిర్మాణానికి బిఎస్ఎన్ఎల్ జనరల్ మేనేజర్ పి.రాజు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ బి.రవి అధ్యక్షతన జరిగిన సభలో రాజు మాట్లాడారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో సాంకేతికతను వినియోగించుకుని విద్యార్థులు అన్ని రంగాల్లో ముందుకు సాగాలన్నారు. చదువుల్లో కంప్యూటర్, ఇంటర్నెట్ ప్రాధాన్యత ఎంతో ఉందన్నారు. పాఠశాల ఆవరణలో బిఎస్ఎన్ఎల్ టవర్ ఏర్పాటుతో ఇంటర్నెట్ అందుబాటులోకి వస్తుందన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బిఎస్ఎన్ఎల్ డిజిఎం రాజశేఖర్ బాబు, ఎజిఎంలు రఘురాం, శ్రీనివాస్, ఇఇ సురేంద్ర, పూర్వ విద్యార్థుల సంఘ అధ్యక్షులు రత్నకుమార్, పిఎంసి అధ్యక్షులు గన్నియ్య, పాల్గొన్నారు.

ఆశ ఆచూకీని తెలపాలి : బర్ల

ప్రజాశక్తి - సీతానగరం

శిరోముండనం బాధితురాలు షేక్ ఆశ ఆచూకీ తెలపాలని బిసి నేత బర్ల బాబూరావు డిమాండ్ చేశారు. శిరోముండనం ఘటన జరిగిన తరువాత ఆమెను రాజమహేంద్రవరంలో మహిళా శిశు సంక్షేమ శాఖకు తరలించామని చెబుతున్న అధికారులు, బాధిత మహిళను మీడియా ముందుకు నేటివరకూ తీసుకురాకపోవడం అనేక అనుమానాలకు తావిస్తుందన్నారు. శిశు సంక్షేమ శాఖ వద్దకు బాధిత మహిళను పరామర్శించాలని ఎవరు వెళ్లినా లోపలకు రానివ్వట్లేదన్నారు. వెంటనే ఆమె ఆచూకీ తెలపాలన్నారు. లేకుంటే ఆమరణ దీక్షకు దిగుతామని హెచ్చరించారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - సీతానగరం

మిర్తిపాడు సబ్ స్టేషన్‌లో మరమతుల నిమిత్తం శుక్రవారం ఉదయం 7గంటల నుండి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నామని ఇఇ దాట్ల శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. మిర్తిపాడు విద్యుత్ సబ్-స్టేషన్ పరిధిలోని 11కేవీ ఫీడర్లకు, మిర్తిపాడు, ఉండేశ్వరపురం,ములకల్లంక, బొబ్బిల్లంక గ్రామాలకు, వ్యవసాయ బోర్లకు విద్యుత్ సరఫరా ఉండబోదన్నారు.

నేరాలు ఘోరాలు

నకిలీపత్రాల కేసులో 8మందికి జైలు

ప్రజాశక్తి - కాకినాడ

నకిలీ పత్రాలు సృష్టించి కాకినాడ మున్సిపాలిటిలో కారుణ్య నియామకం పొందిన మహిళకు, ఆమె కుటుంబ సభ్యులకు, అందుకు సహకరించిన మున్సిపల్ ఉద్యోగులకు మొత్తం 8 మందికి కాకినాడ రెండవ అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ 3 సంవత్సరాల జైలు శిక్ష, 5 వేల రూపాయల జరిమానా విధించారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను రెండవ పట్టణ లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్ ఎస్‌సిహెచ్ఒఓ ప్రకటనలో విడుదల చేశారు. 2012వ సంవత్సరంలో కాకినాడ మున్సిపాలిటిలో ఉద్యోగం చేస్తున్న రేచర్లపేటకు చెందిన కోల్లాబత్తుల వెంకటరమణ అనారోగ్యంతో చనిపోయాడు. అయితే అతని భార్య కొల్లాబత్తుల అరుణ కుమారి జీవనోపాధి నిమిత్తం విదేశాలకు వెళ్లింది. దీంతో ఆమె అత్త, కుటుంబ సభ్యులు అందరు ఏకమై అరుణకుమారి తోటికోడలు కోల్లాబత్తుల లక్ష్మిని అరుణకుమారిగా నకిలీపత్రాలను సృష్టించారు. ఆ పత్రాల ద్వారా కాకినాడ మున్సిపాలిటీలో కారుణ్య నియామకంలో ఉద్యోగంలో చేరింది. మృతిడు వెంకటరమణ కుటుంబానికి రావాల్సిన రాయితీలు అన్ని లక్ష్మి నే తీసుకుంది. అయితే విదేశాల నుంచి తిరిగి వచ్చిన అరుణకుమారి జరిగిన వ్యవహారం అంతా తెలుసుకుని పూర్తి ఆధారాలతో టూ టౌన్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీనిపై పోలీసులు నమోదు చేసిన కేసులో విచారించి ఈ కేసులో ముద్దాయిలుగా గుర్తించిన కొల్లాబత్తుల అప్పయ్యమ్మ, కొల్లాబత్తుల లక్ష్మి, కొల్లాబత్తుల గోపి, కొల్లాబత్తుల శ్రీనివాసరావు, కొల్లాబత్తుల శారద, కిలీమి వీర రాఘవరెడ్డి, నీలాపు రమణ, సాడి సత్యనారాయణలను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చారు. ఈ కేసున విచారించిన కాకినాడ 2వ అదనపు జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ఎం.ప్రసన్నలక్ష్మి ముద్దాయిలపై నేరం రుజువుకావడంతో ఒక్కొక్కరికి 3 సంవత్సరాలు కఠిన కారాగార శిక్షతోపాటు ఒక్కొక్కరికి రూ.5 వేలు చొప్పున జరిమానా విధించారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

ప్రజాశక్తి - పిఠాపురం

పట్టణంలోని స్థానిక పాదగయ కూడలి వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందింది. యు కొత్తపల్లి మండలం కొత్త మూల పేటకు చెందిన భార్యాభర్తలు సిహెచ్ నాగేశ్వరరావు, అపర్ణ ద్విచక్ర వాహనంపై కాకినాడ నుంచి స్వగ్రామానికి వస్తుండగా పాదగయ జంక్షన్ వద్ద మలుపు తిరిగే క్రమంలో వీరిని ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో అపర్ణ(35) అక్కడి కక్కడే మృతి చెందింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గాయపడిన యువకుడు మృతి

ప్రజాశక్తి-మండపేట

ప్రమాదవశాత్తు కాలుజారి మండలంలోని ఏడిద గ్రామానికి చెందిన యువకుడు మృతి చెందాడు. బుధవారం రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు ఎలా ఉన్నాయి. ఏడిద గ్రామానికి చెందిన సిద్ధంతపు రవి (27) తాపేశ్వరంలోని రైస్ మిల్లులో కూలీగా పనిచేస్తున్నాడు. మంగళవారం ఉదయం రైస్ మిల్‌లో పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు జారి పడడంతో తలకు బలమైన గాయమైంది. అతడిని స్థానికులు రాజమహేంద్రవరం ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లాగా అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మతుని బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్ఐ చైతన్యకుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తహశీల్దార్‌ను కలిసిన వైసిపి నాయకులు

ప్రజాశక్తి- గోకవరం

నూతనంగా బాధ్యతలు స్వీకరించిన తహశీల్దార్ బి.హేమకుమారిని వైసిపి సీనియర్ నాయకులు సుంకర వీరబాబు, వైసిపి మండల కన్వీనర్ పాటి రాంబాబు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆమెకు పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు తోలేటి రాంప్రసాద్, నండూరి బుజ్జి, బి.చిన్ని, కర్రి శివరామకృష్ణ, ఎస్.పాండురంగ పాల్గొన్నారు.

9న జెవివి సైన్స్ కళాయాత్ర

ప్రజాశక్తి-అమలాపురం

రాష్ట్రవ్యాప్తంగా శాస్త్రీయ దక్పథ ప్రచారంలో భాగంగా జన విజ్ఞాన వేదిక ప్రజాసైన్స్ కళాయాత్ర నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా ఈ నెల 9న స్థానిక గడియాస్తంభం సెంటర్ వద్ద మధ్యాహ్నం 3 గంటలకు కళాజాతా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జెవివి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ ఇఆర్.సుబ్రహ్మణ్యం, ఎండీ.ఖాజా మొహిద్దీన్ తెలియజేశారు. సైన్స్ నృత్యరూపాలు, గీతాలు, నాటికలు, మేజిక్స్ ద్వారా సైన్స్ ప్రచారం జరుగుతోందన్నారు. ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రజలంతా పాల్గొని విజయవంతం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

అసెంబ్లీ సీటుపై అభిప్రాయ సేకరణ

ప్రజాశక్తి-కాట్రేనికోన

ముమ్మిడివరం అసెంబ్లీ సీటు ఎవరికోననే మల్లగుల్లాల నేపథ్యంలో టిడిపి అధిష్టానం నియోజకవర్గ ప్రజల అభిప్రాయ సేకరణ నిర్వహిస్తోంది. ముమ్మిడివరం సీటు తమదంటే తమదంటూ టిడిపి, జనసేన పార్టీలు పట్టుబడుతున్న తరుణంలో ప్రజాభిప్రాయ సేకరణకు ప్రాధాన్యత సంతరించుకుంది. బుధవారం ఉదయం 7317170279 నంబర్ నుంచి చంద్రబాబు వాయిస్‌తో అభిప్రాయ సేకరణ చేసారు. దాట్ల బుచ్చిబాబు అయితే 1, నోటా అయితే 2 నొక్కండి అని ఐవిఆర్ఎస్ కాల్ రావడంతో దాన్ని అనుసరించి ప్రజలు తమ అభిప్రాయం తెలిపారు.

మండపేట తహశీల్దార్‌గా సురేష్‌బాబు

ప్రజాశక్తి-మండపేట

మండపేట తహశీల్దార్‌గా సురేష్‌బాబు బాధ్యతలు చేపట్టారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా ఆయన ఇక్కడికి వచ్చారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్ సూపరింటెండెంట్‌గా పని చేస్తూ బదిలీపై వచ్చారు. గత 2019 ఎన్నికల్లో రామచంద్రపురం తహసీల్దార్‌గా ఆయన పని చేశారు. మండలంలోని గ్రామాల్లో పర్యటించి ఇక్కడి సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు. డిప్యూటీ తహసిల్దార్ పద్మ, ఆర్ఐ కంఠంశెట్టి గౌరీ దేవి, విఆర్ఓలు ఆయనకు అభినందనలు తెలిపారు.

పని ఒత్తిడి ఎక్కువ..జీతాలు తక్కువ

- సంక్షేమ పథకాలకు దూరం
-నిరంతరం రాజకీయ వేధింపులే
- నేడు ఆశాలు 'చలో విజయవాడ'

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

కాకినాడ రామారావు పేటలోని ఓ కళ్యాణ మండపంలో పోలీసులు నిర్బంధంలో ఉన్న ఆశా వర్కర్లు

ప్రజల ఆరోగ్య పరిరక్షణ బాధ్యతలు చూస్తూ మాతా శిశు మరణాలు తగ్గించడంకోసం కీలక పాత్ర పోషిస్తున్న ఆశా వర్కర్లు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నారు. గత నాలుగున్నర ఏళ్లుగా వైసిపి ప్రభుత్వం పరిష్కరిస్తుందని ఆశగా ఎదురు చూసినా ఫలితం లేకపోవడంతో ఆశాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కనీస వేతనాలు అమలు చేయాలని, రాజకీయ వేధింపులు నిలుపుదల చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలనే తదితర డిమాండ్ల సాధనకు గురువారం చలో విజయవాడ కార్యక్రమానికి పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో జిల్లా ఆశ వర్కర్స్ యూనియన్ నాయకులు, పలువురు కార్యకర్తలను ప్రభుత్వ ఆదేశాలతో పోలీసులు ఎక్కడికక్కడ అరెస్టు చేసి అక్రమంగా నిర్బంధాన్ని ప్రయోగిస్తున్నారు.

కాకినాడ, తూర్పుగోదావరి, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాల్లో 3 వేల 200 మంది ఆశ కార్యకర్తలు పనిచేస్తున్నారు. నిరంతరం ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం పనిచేస్తున్న ఆశాలకు కనీస వేతనం కరువైంది. ప్రస్తుతం పెరుగుతున్న ధరలకు హద్దు లేకుండా పోతుంది. నిత్యవసరాల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. కూరగాయలు రేట్లు దిగిరానంటున్నాయి. పెట్రోలు, డీజిల్, గ్యాస్ ధరల భారం పేదలపై ఎక్కువగా ఉంది. మరోవైపు విద్యుత్ ఛార్జీల పెంపు ఇతర భారాలు ఆశలపై కూడా పడ్డాయి. ఈ నేపథ్యంలోనే కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని వారు కోరుతున్నారు. పనికి తగ్గ జీతాలు లేక అల్లాడుతుంటే ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడుతున్నారు.

రూ.10 వేలు వేతనం ఇస్తున్నామని గొప్పగా చెబుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను నిలిపివేయడం దారుణమని తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇచ్చే అరకొర వేతనం కనీసం ఇంటి అద్దెలకు కూడా సరిపోవడం లేదని చెబుతున్నారు. పిల్లల ఫీజులు, పెరిగిన ధరలను అధిగమించి కుటుంబాలను పోషించుకోవాలంటే కష్టంగా మారిందని ఆందోళన చెందుతున్నారు. కోవిడ్ కాలంలో ప్రాణాలకు తెగించి సేవలు అందేలా మాపై ఒత్తిడి తీసుకొచ్చినా అనారోగ్యాలకు సైతం గురై పని చేసామని అయితే తగిన గుర్తింపు లేదని వాపోతున్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ సక్రమంగా అమలు చేయడం లేదని కావునా రూ.5 లక్షలు ఇవ్వాలని, రిటైర్డ్ అయిన వారి, మరణించిన వారి కుటుంబాలకు అర్హులైన వారిని ఆశా వర్కర్లుగా తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఇలా అనేకంగా ఉన్న తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతున్నారు. రాజకీయ వేధింపులతో నిత్యం సతమతమవుతున్నామని, స్థానిక నాయకుల జోక్యం లేకుండా తమ పని చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

అక్రమంగా గృహ నిర్బంధం

రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా చలో విజయవాడకు పిలుపునిచ్చిన నేపథ్యంలో జిల్లాలో సిఐటియు, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులను పోలీసులు రెండు రోజులు ముందు నుంచే అక్రమంగా గృహ నిర్బంధం చేశారు. సిఐటియు జిల్లా కార్యదర్శి బాలం శ్రీనివాస్‌ను సామర్లకోటలో తెల్లవారుజామున 5 గంటలకు ఇంటికి వెళ్లి స్టేషన్‌కు తరలించి సాయంత్రం వరకు ఉంచారు. సామర్లకోట మండలం వేట్లపాలెం సబ్ సెంటర్లో పనిచేస్తున్న గౌసి అనే ఆశా కార్యకర్తను వికెరాయపురంలో ఆమె ఇంటి వద్ద నుంచి ఉదయం తీసుకువెళ్లి మధ్యాహ్నం వరకూ సెంటర్లోనే ఉంచి తర్వాత పోలీస్ స్టేషన్‌కు తరలించారు. శరభవరంలో సత్యా అనే ఆశా వర్కర్ ఇంటిని చుట్టుముట్టిన పోలీసులు నోటీసులు ఇచ్చి అక్కడే నిర్బంధించారు. కిర్లంపూడిలో రమణమ్మ అనే ఆశ ఇంటివద్ద బయటకు కదలకుండా పోలీసులు పహారా కాశారు. ఏలేశ్వరం నుంచి చలో విజయవాడ బయలుదేరిన ఐదుగురు వర్కర్లను మార్గం మధ్యలో అడ్డుకుని పోలీస్ స్టేషన్లో ఉంచారు. కాకినాడలో పోర్టు పోలీస్ స్టేషన్‌లో టికెట్లు తీసుకుని రైలు ఎక్కిన సుమారు 30 మందిని అడ్డుకుని రామారావుపేట కళ్యాణ మండపంలో నిర్బంధించారు. సాయంత్రం వరకూ ఉంచి ఆ తర్వాత విడిచి పెట్టారు.

రాజీలేని పోరాటమే ఎపిటిఎఫ్ ఆశయం

ప్రజాశక్తి - తాళ్లపూడి

ఉపాధ్యాయులు, ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం రాజీలేని పోరాటం చేయడమే ఎపిటిఎఫ్ ఆశయమని జిల్లా అధ్యక్షుడు దున్నా దుర్గారావు అన్నారు. జిల్లా అధ్యక్షునిగా రెండోసారి ఎన్నికైన దుర్గారావును ఎపిటిఎఫ్ మండల శాఖ బుధవారం ఘనంగా సత్కరించింది. మండలంలోని పైడిమెట్ట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మండల శాఖ అధ్యక్షులు పి.రఘువీరశాస్త్రి అధ్యక్షతన జరిగిన ఈ సన్మాన కార్యక్రమంలో దుర్గారావు మాట్లాడారు. సమస్యలపై పోరాటంతో పాటూ జిల్లా శాఖను అన్ని విషయాల్లోనూ రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో ఉంచడానికి కృషి చేస్తానన్నారు. సభకు అధ్యక్షత వహించిన రఘువీరశాస్త్రి మాట్లాడుతూ జిల్లా సంఘానికి తాళ్లపూడి మండల శాఖ అన్ని విషయాల్లోనూ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సనపల రాజశేఖర్, ఎపిటిఎఫ్ జిల్లా మండల నాయకులు నాని, పద్మశ్రీ మణి, కనకదుర్గ, రాజారత్నం, మూర్తి, కృష్ణమోహన్, జివికె.రాజు, సుభాషిణి, కె.శ్రీనివాస్ శేషాభాయి, గంగాదేవి, జెడి.సునీత, వైఎన్.పద్మ తదితరులు ఉన్నారు.

దుర్గారావును సత్కరిస్తున్న ఎపిటిఎఫ్ మండల శాఖ నాయకులు

ఫ్లైఓవర్ పనుల పరిశీలన

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

కార్మికులతో కలిసి పనులను పరిశలిస్తున్న ఎంపీ భరత్

మోరంపూడిలో ఫ్లయ్‌ఓవర్ పనులను ఎంపీ మార్గాని భరత్‌రామ్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. టిడిపి హయాంలో ఫ్లయ్‌ఓవర్ మంజూరైందని చెబుతున్నారని, కేంద్ర అధికారుల బృందం పరిశీలనకు వచ్చి ఇక్కడ బ్లాక్ స్పాట్స్ లేవని చెప్పి ఎఫ్ఓబిని క్యాన్సిల్ చేస్తే టిడిపి నేతలు ఏం చేశారని ప్రశ్నించారు. నగర నడిబొడ్డున ఉన్న మోరంపూడి జంక్షన్ వద్ద కొన్ని వేల ప్రమాదాలు, వందలాది మంది మృత్యువాత పడటానికి టిడిపి నాయకులే కారణమన్నారు. 2015 పుష్కరాల సమయంలో చంద్రబాబు ప్రచార వ్యామోహం కారణంగా 29 మంది మరణించారన్నారు. 2014-2019 మధ్యన కేంద్రంలోని ఎన్‌డిఎతో టిడిపి అంటకాగిందని, అప్పుడు టిడిపి ఎంపీలు, ఎంఎల్ఎలు ఏం చేశారని ప్రశ్నించారు. ఆ తొమ్మిదేళ్ల కాలంలో మోరంపూడి జంక్షన్లో సంభవించిన ప్రమాదాల్లో పలువురు మరణించారన్నారు. దీనికి నూరు శాతం బాధ్యత టిడిపి నాయకులదేనన్నారు. కేన్సిల్ అయిన ఈ ప్రాజెక్టును [illegible] ప్రస్తావించానన్నారు. నేషనల్ హైవే మంత్రి నితిన్ గడ్కరి వద్దకు వెళ్లి పరిస్థితిని వివరించి మంజూరు చేయించానని తెలిపారు. నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని చెప్పారు. మార్చి నెలాఖరు నాటికి పనులు పూర్తయి..జాతికి అంకితం చేస్తామని తెలిపారు.

సూరిబాబుకు వైసిపి నాయకుల పరామర్శ

ప్రజాశక్తి- గోకవరం

మాతృవియోగంతో బాధపడుతున్న గుమ్మళ్ల దొడ్డికి చెందిన వైసిపి నాయకులు కోట సూరిబాబును వైసిపి నాయకులు బుధవారం పరామర్శించారు. సూరిబాబు భార్య కోట సత్యవతి ఎంపిటిసి సభ్యులుగా ఉన్నారు. వైసిపి మండల సీనియర్ నాయకులు సుంకర వీరబాబు, మండల కన్వీనర్ పాటి రాంబాబు, నాయకులు తోలేటి రాంప్రసాద్, నండూరి బుజ్జి, బి.చిన్ని సూరిబాబు కుంటుబాన్ని పరామర్శించారు. కుటుంబ సభ్యులకు సానుభూతిని వ్యక్తం చేశారు.

సూరిబాబును పరామర్శిస్తున్న వైసిపి నాయకులు

మందులు అందిస్తున్న వాసు, సత్యనారాయణ తదితరులు

ప్రజల ఆరోగ్యమే ధ్యేయం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ప్రజలు ఆరోగ్యంగా జీవించాలన్న ధ్యేయంతో ప్రజల కోసం మెగా వైద్య శిబిరాలను ఉచితంగా నిర్వహిస్తున్నామని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి శ్రీనివాస్, జనసేన పార్టీ రాజమండ్రి సిటీ ఇన్‌ఛార్జ్ అత్తి సత్యనారాయణ అన్నారు. భవాని చారిటబుల్ ట్రస్టు, వాసవీ శ్రీమల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఇందిరానగర్‌లో నిర్వహించిన వైద్య శిబిరాన్ని వారు ప్రారంభించారు. వైద్య పరీక్షల అనంతరం అవసరమైన వారికి టిడిపి రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్‌కుమార్, రాజమండ్రి పార్లమెంట్ కమిటీ కార్యనిర్వాహక కార్యదర్శి కొయ్యల రమణ తదితరులతో కలిసి మందులను ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా ఆదిరెడ్డి శ్రీనివాస్, అనుశ్రీ సత్యనారాయణ మాట్లాడారు. టిడిపి హయాంలో ప్రజల ఆరోగ్యం కోసం అనేక కార్యక్రమాలు చేపట్టారన్నారు. చంద్రన్న బీమా ద్వారా లక్షలాది మందిని ఆదుకున్నామని గుర్తు చేశారు. ప్రస్తుత జగన్ పాలనలో ఆరోగ్యశ్రీ పథకం అడుగంటిందన్నారు. ఆరోగ్యశ్రీ ఆసుపత్రులకు బిల్లులు పెండింగ్‌లో ఉండటం వల్ల పేదలకు వైద్యం అందట్లేదన్నారు. పేదలకు వైద్యం అందించేందుకు తాము ఈ వైద్యశిబిరాలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నగర ఉపాధ్యక్షులు ఉప్పులూరి జానకి రామయ్య, కొల్లి బుజ్జి, మహిళా కమిటీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తురకల నిర్మల, రాజమండ్రి పార్లమెంట్ బిసి సెల్ ఉపాధ్యక్షులు అగురు ధన్‌రాజు, ఎస్‌సి సెల్ నగర అధ్యక్షులు చాపల చిన్నరాజు, నగర మహిళ కమిటీ ప్రధాన కార్యదర్శి కానేటి కృపామణ పాల్గొన్నారు.

యానాం వార్తలు

మీడియాతో మాట్లాడుతున్న ఎస్‌పి రఘునాయిగం

యానాం ప్రజల సహకారం మరువలేను

ప్రజాశక్తి - యానాం

యానాం ప్రజలు అందించిన సహకారాన్ని ఎన్నడూ మరువలేనని పుదుచ్చేరికి బదిలీపై వెళ్తున్న ఎస్‌పి రఘునాయిగం అన్నారు. స్థానిక ఎస్‌పి కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. యానాం ఎస్‌పిగా బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి నేటి వరకూ నియోజకవర్గంలో శాంతిభద్రతలకు భంగం వాటిల్లకుండా ప్రజలు ఎంతగానో సహకరించారని అన్నారు. యానాం ప్రాంతం, ప్రజలు తనకు ఎంతో సంతృప్తిని ఇచ్చేలా సహాయ, సహకారాలు అందించారని సంతోషం వ్యక్తం చేశారు. తన విధి నిర్వహణలో సంపూర్ణ సహకారం అందించిన రాజకీయ నాయకులు, ప్రజలు, పోలీసు అధికారులు, సిబ్బంది, ఇతర ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బందికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

సిఎం ఎంతో మాట్లాడుతున్న ఉద్యోగులు, యూనియన్ ప్రతినిధులు

సిఎంను కలిసిన డైలీ రేటెడ్ ఉద్యోగులు

ప్రజాశక్తి - యానాం

యానాంలో వివిధ ప్రభుత్వ శాఖల్లో డైలీ రేటెడ్ ఎంప్లాయిస్‌గా పని చేస్తున్న సిబ్బంది ముఖ్యమంత్రి రంగస్వామిని పుదుచ్చేరి ఎంప్లాయిస్ యూనియన్ ప్రతినిధులు అధ్వర్యంలో బుధవారం కలిశారు. ఈ సందర్భంగా వివిధ శాఖల్లో ఉన్న హౌస్ కీపింగ్, వాచ్‌మెన్ పోస్టులను వెంటనే పర్మినెంట్ చేయాలని కోరినట్లు తెలిపారు. సిఎం సానుకూలంగా స్పందించారని త్వరలో పర్మినెంట్ చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిపి అండ్ ఎఆర్ సెక్రటరీ కేశవన్, పుదుచ్చేరి ఎంప్లాయిస్ యూనియన్ సభ్యులు సెల్వం, రాజేంద్రన్, మురుగవేల్, ఆనంద రాజన్, సుమిత్ర తదితరులు పాల్గొన్నారు.

NOTICE

Under the instructions from my Client Bank of Baroda, Main branch, Rajahmundry represented by its chief Manger **PALLA SAI SAGAR,** S/o. Vasudevarao, The general Public are hereby Informed as follows:

That my client's branch was shifted from D.No. 31-1-40, Ajantha Hotel Building, Main Road Rajahmundry to the present premises bearing D.No. 6-1-8, Pushkar Ghat, Rajahmundry on **23.12.2022.** that thereafter, it is noticed by my client that the original of Doc No. **6289 of 2001** dated **07-12-2001** of the office District registrar, Rajahmundry executed by Jatla_Bhimaraju in favour of **DONTHAMSETTI KIRAN KUMAR** and Original of Doc **6288 of 2001** dated **07.12.2001** of the office of District Registrar, Rajahmundry executed by **Jatla Bhimaraju** in favour of **Mavuri Malleswari** were lost during transit.

That the General public at large is hereby informed that if anyone finds the original documents as aforesaid, they are hereby requested to return the same to my client.

MYLAVARAPU SRIKANTH
Rajahmundry Advocate
06-02-2024 Rajahmundry-533104

మండపేట ఎంపిడిఒగా శ్రీదేవి

ప్రజాశక్తి-మండపేట

మండపేట ఎంపిడిఒగా కె.శ్రీదేవి బుధవారం బాధ్యతలు చేపట్టారు. తూర్పు గోదావరి జిల్లా గోపాలపురం ఎంపిడిఒగా పని చేస్తూ ఆమె సాధారణ ఎన్నికల్లో భాగంగా బదిలీపై వచ్చారు. ప్రస్తుతం ఇక్కడ ఇన్‌ఛార్జి ఎంపిడిఒగా రాయవరం మండల ఇఒపిఆర్డీ ఐదం రాజు బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

ముద్రగడను కలిసిన ఆర్యవైశ్య నేతలు

ప్రజాశక్తి-అమలాపురం

మాజీ మంత్రి రాష్ట్ర కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభంను బుధవారం అమలాపురం ఆర్యవైశ్య మాజీ అధ్యక్షులు ఛాంబర్ ప్రధాన కార్యదర్శి యెండూరి నాగేశ్వరరావు, మాజీ అధ్యక్షుడు ప్రముఖ అడ్వకేట్ నంబూరి మూర్తి, వీరితోపాటు రాష్ట్ర కాపు నాయకులు కల్వకొలను తాతాజీ ఉన్నారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై వీరు విశ్లేషించినట్టు తెలిసింది.

అభివృద్ధి అంటే రాళ్లకు రంగులేయడం కాదు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

అభివృద్ధి చేయడం అంటే నాలుగు రాళ్లు అంటించేసి... లీటర్ రంగు వేసేయడం కాదన్న సంగతి వైసిపి నాయకులు గ్రహించాలని టిడిపి నగర ప్రధాన కార్యదర్శి బుడ్డిగ రాధ అన్నారు. ప్రెస్ క్లబ్‌లో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. టిడిపి ప్రభుత్వ హయాంలోనే నగరంలో చేయాల్సిన అభివద్ధి అంతా జరిగిందన్నారు.కొత్తగా వైసిపివారు చేసేదేముందన్నారు. సుబ్రహ్మణ్య మైదానానికి ఎంతో చరిత్ర ఉందన్నారు. అటువంటి స్థలాన్ని కూడా ఎంపీ మార్గాని భరత్ రామ్ వదల కుండా ఓపెన్ ఆడిటోరియం థియేటర్ అంటూ నిర్మాణం చేస్తే ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీల సభలు ఎక్కడ నిర్విహించుకోవాలని ప్రశ్నించారు. ఎంతో ప్రాముఖ్యత కలిగిన ఎకెసి కళాశాల వద్ద కప్పుసాసర్ ఏంటని ప్రశ్నించారు. ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఈతలపాటి కష్ణ, తెలుగు యువత నగర కమిటీ అధ్యక్షులు ఉర్లంకల లోకేష్ వైసిపి ఇక తట్టా బుట్టా సర్దుకునే సమయం ఆసన్నమైందన్నారు. మసి పూసి మారేడు కాయ చేయాలనుకుంటున్న ఎంపీ భరత్ రామ్, అతని వెనుక తిరిగే భజన బృందం ఆటలు ఇక చెల్లవన్నారు. ఆదిరెడ్డి కుటుంబంపై లేని పోని వ్యాఖ్యలు చేసే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. ఈ సమావేశంలో టిఎన్‌టియుసి నగర ప్రధాన కార్యదర్శి జోగినాయుడు, రాజమండ్రి పార్లమెంట్ ఉపాధ్యక్షులు యర్రంశెట్టి రాజ్‌కుమార్, టిడిపి సీనియర్ నాయకులు కరగాని వేణు, తెలుగు యువత నగర కార్యదర్శి దుద్దేటి నాగేంద్ర యాదవ్ పాల్గొన్నారు.

ఉద్యోగుల సమాచారం తప్పనిసరి : కలెక్టర్

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం రూరల్

ఎన్నికల విధులను నిర్వహించే ఉద్యోగులు సమాచారం, వారి ఓటరు కార్డు వివరాలను పిపిఎంఎస్ పోర్టల్‌లో నమోదు చేయాలని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన పిపిఎంఎస్ డేటా నమోదు కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాధవీలత మాట్లాడారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు ప్రతి ఒక్క ఉద్యోగి బాధ్యత అత్యంత కీలకం అని స్పష్టం చేశారు. జిల్లాలో మొత్తం 15 వేల మంది ఉద్యోగుల సమగ్ర సమాచారం పిపిఎంఎస్ పోర్టల్‌లో నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. ఇప్పటి వరకూ సుమారు 5 వేల మంది వివరాలు పూర్తి చేసినట్లు తెలిపారు. విద్యా శాఖకు చెందిన 5 వేల మంది ఉపాధ్యాయుల డేటా ఎంట్రీ చేయాల్సి ఉండగా ఇప్పటి వరకూ రెండు వేల మంది వివరాలు నమోదు చేశారన్నారు. ప్రతిరోజూ నాలుగు మండలాల నుంచి డేటా నమోదు చేస్తున్నట్లు తెలిపారు. ఈ నమోదు ప్రక్రియను డిఆర్ఒ జి.నరసింహులు, సిపిఒ ఎల్.అప్పలకొండ, డిఎల్‌డిఒ పి.వీణాదేవి పర్యవేక్షిస్తున్నారన్నారు.



ఎంట్రీలపై ఆరా తీస్తున్న కలెక్టర్ మాధవీలత

దస్తావేజులు పోయినవి

బిక్కవోలు మండలం బిక్కవోలు గ్రామానికి చెందిన కోడూరి నాగలక్ష్మి W/o కోడూరి శ్రీనివాసరావుకు చెందిన బిక్కవోలు పంచాయతీ పరిధిలోని గ్రామా రెవెన్యూ తాలూకా సర్వే నెంబరు 348/3 డోర్ నెంబరు 11-10, 94 1/2 1/2 (471/4) ఖాళీ స్థలానికి సంబంధించిన దస్తావేజు నెంబరు 231/2004 ఒరిజినల్ దస్తావేజు బిక్కవోలు ఆంధ్రాబ్యాంక్ వీధిలో ఉన్న మా ఇంటి నుంచి ఆంజనేయ స్వామి గుడి వద్ద నుంచి వెళుతుండగా మార్గం మధ్యలో పడిపోయినవి. ఎవరికైనా దొరికిన ఎడల ఈ కింది అడ్రస్‌కు తెలియపరచగలరు.

కోడూరి నాగలక్ష్మి W/o కోడూరి శ్రీనివాసరావు,
బిక్కవోలు, బిక్కవోలు మండలం,
సెల్ 8008457457

ఎన్.కొత్తపల్లిలో 'గడప గడపకూ కాంగ్రెస్'

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

ఎన్.కొత్తపల్లి పంచాయతీ నల్లా వారి పేటలో బుధవారం గడపగడపకూ కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పోలిశెట్టి హరిబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కామన ప్రభాకరరావు ప్రారంభించారు. ఇంటింటికి వెళ్లి కేంద్రంలో బిజెపి ప్రభుత్వం రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వాలు దగా వంచన మోసం చేస్తూ పాలన సాగిస్తున్నాయని రాబోయే ఎన్నికల్లో గుణపాఠం చెప్పి కాంగ్రెస్‌ను బలపరచాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే చేపట్టబోయే సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. దేశంలో రాహుల్ గాంధీ నాయకత్వాన్ని బలపరచాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ అమలాపురం పార్లమెంట్ ఇన్‌ఛార్జ్ మట్టా శివప్రసాద్, ఎఐసిసి కో ఆప్షన్ సభ్యులు చీకట్ల అబ్బాయి, ఎపిసిసి ఉపాధ్యక్షులు కొత్తూరి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శులు అయితాబత్తుల సుభాషిణి, మాచవరపు శివన్నారాయణ, మహమ్మద్ ఇస్మాయిల్ అరిఫ్, నిమ్మకాయల నాగేంద్ర ప్రసాద్, సభ్యులు దోనిపాటి విజయలక్ష్మి, గెడ్డం సురేష్ బాబు, వాకపల్లి రాంబాబు, వంటెద్దు బాబి, సాధనాల సత్యనారాయణ, రాయుడు వెంకటరమణ, దేవరపల్లి రాజేంద్రబాబు, రెడ్డి బాబు పాల్గొన్నారు.

తుని పురపాలక సంఘం
"ఇ" ప్రొక్యూర్‌మెంట్ టెండరు నోటీసు

ఆర్ఒసి నెం.388/2017/ఇ1 తేది:07-02-2024

తుని పురపాలక సంఘము నందు సాధారణ నిధుల నుండి 18 పనులు చేపట్టి పూర్తి చేయుటకు "ఇ" ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారంపై టెండరు ఆహ్వానించడమైనది. సదరు టెండరుకు సంబంధించిన ఇతర వివరములు ది.09/02/2024 ఉదయం 11.00 నుండి WWW.apeprocurement.gov.in వెబ్‌సైట్‌లో చూడగలరు.

సంప్రదించవలసిన చిరునామా: కమిషనరు, తుని మున్సిపాలిటీ ఫోన్ నెం: 9849905806, 9849919375, 08854-253506 e-mail:tunimunicipality@gmail.com

సం/-ఎ.వెంకటరావు,
కమిషనరు, తుని పురపాలకసంఘం.

In the Court of the I Additional Junior Civil Judge, Tanuku
E.P. 42/2019, O.S. 348/2018

Between:
DHR: Raghamanda Srinu
JDR: Ryali Rama Krishna

DHR తరపున చేసిన వేలం ప్రకటన

యిందుమూలముగా యావన్మందికి పై కోర్టు వారి ఆదేశం తెలియజేయునది ఏమనగా, ఈ దిగువ ఉదహరించిన షెడ్యూలు ఆస్తిని **ది. 26-2-2024న ఉదయం గం॥ 10.30 ని॥లకు** గౌరవనీయులైన I Additional Junior Civil Judge, Tanuku వారి కోర్టు నందు బహిరంగ వేలము వేయబడును. కావున ఆసక్తి గలవారు పై తేదీన పై కోర్టు వారి షరతుల ప్రకారం వేలంలో పాల్గొనవచ్చునని ఈ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది.

షెడ్యూలు: పశ్చిమగోదావరి జిల్లా, సజ్జాపురం సబ్ రిజిస్ట్రీలో చేరిన ఉండ్రాజవరం మండలం, వడ్లూరు గ్రామపంచాయతీ ఏరియాలో వడ్లూరు గ్రామం తాలూకా రి.స. నెం. 245/3రు దాఖలా స్థలమున్నూ, యిందులోని డోరు నెం. 2-92 రు గల పెంకుటి యిల్లున్నూ, రేకుల షెడ్డున్నూ, ఆర్.సి.సి. బాత్‌రూమ్ వగైరాలకు ప్రతుల వారి వివరం.

1వ ప్రతి:
తూర్పు: 3వ ప్రతి ఉమ్మడి మార్గం అ. 24.8లు. **పడమర:** మరువాడ సుభారమేష్ వగైరాల సందు స్థలం అ. 24.8 లు. **ఉత్తరం:** 2వ ప్రతి అ. 24.9లు. **దక్షిణం:** పంచాయతి రోడ్డు అ. 24.9లు. *యీ హద్దులు మధ్య చ॥గ॥ 67.81 లు స్థలమున్నూ.*

2వ ప్రతి:
తూర్పు: కావలిపురపు బంగారయ్య గారి స్థలం అ. 42లు. **పడమర:** గొర్రెల సన్యాసిరావు, గొర్రెల సింహాచలం గార్ల స్థలం అ. 43.8లు. **ఉత్తరం:** పెన్మెత్స వెంకట సూర్యనారాయణరాజు గారి స్థలం అ. 33.3లు. **దక్షిణం:** 1, 3 ప్రతులు అ. 32.8లు. *యీ హద్దుల మధ్య చ॥గ॥ 157లు స్థలమున్నూ.*

3వ ప్రతి: ఉమ్మడి సందు మార్గమునకు
తూర్పు: కావలిపురపు వీరన్న స్థలం అ. 24.8లు. **పడమర:** 1వ ప్రతి అ. 24.8లు. **ఉత్తరం:** 2వ ప్రతి అ. 7.6లు. **దక్షిణం:** పంచాయతి రోడ్డు అ. 7.6లు. *యీ హద్దుల మధ్య చ॥గ॥ 20.55 లులో 1/3వ వంతు అనిర్దిష్టపు జాయింటు హక్కు గల చ॥గ॥ 6.85లు స్థలమున్నూ.*

వెరశి మూడు ప్రతుల తాలూకు మొత్తం *చ॥గ॥ 231.66లు స్థలమున్నూ, యిందులోని పెంకుటి యిల్లు, రేకుల షెడ్డు, ఆర్.సి.సి. బాత్‌రూమున్నూ, సమస్త యీజుమెంటు హక్కులతో.*

DHR Value: Rs. 9,00,000/-
Amina Value: Rs. 13,50,000/-
Market Value: Rs. 11,34,118/-
JDR Value: Not known

M.SATYANARAYANA CHARI
Advocate, Tanuku
Cell: 9493480640